

# నేను - నా నవలలు

## సూర్యదేవర రామ్ మోహన్‌రావు



1985లో 'మోడల్' నవలతో తెలుగు నవలా ప్రపంచంలో రచయితగా అడుగుపెట్టిన రామ్ మోహనరావుగారు మొదటి నవలతోనే సంచలన రచయితగా పేరు తెచ్చుకున్నారు. తరువాత వ్రాసిన ప్రతి నవలకీ ఒక వైవిధ్య భరితమైన నేపథ్యాన్ని ఎన్నుకుని, ప్రతి కథాంశం మీద ఎన్నో పరిశోధనలు చేశారు. చరిత్రనీ, వాస్తవాలనీ, విశ్లేషణనీ, కల్పననీ సమపాళ్ళలో రంగరించి 'ఇన్వెస్టిగేటివ్ ట్రెండ్ సెట్టర్'గా తెలుగు నవలా పాఠకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఈయన నవలలు ఇతర భారతీయ భాషల్లోకి అనువదించబడి అన్ని చోట్లా సంచలనం సృష్టించడం మరో విశేషం. ఇంతవరకూ 92 నవలలు వెలువరించి అతి త్వరలోనే వందవ నవల మైలురాయిని చేరబోతున్న శ్రీ సూర్యదేవర నిరంతర అన్వేషి, నిత్య పరిశోధకుడు, విలక్షణ రచయిత. వారి నవలల వెనుకనున్న కృషినీ, అందుకోసం ఆయన చేసిన ఆసక్తికరమైన పరిశోధనా విశేషాలనీ నెలనెలా 'కౌముది' పాఠకులతో పంచుకోబోతున్నారు. ఇది ఆయన కేవలం 'కౌముది' కోసమే వ్రాస్తున్న ప్రత్యేక శీర్షిక..!

### పూర్వ రంగం

### మూడో భాగం




*(గత సంచిక నుంచీ కొనసాగింపు)*

ఈ క్రమంలో ఓ పక్క రక్తచందనం నవలకి కావల్సిన వివరాలు సేకరించుకుంటూ వాటిని ఉత్కంఠకలిగించే రీతిలో పేర్చుకుంటూ, నవలకు అవసరమయ్యే కథాంశాన్ని మనసులోనే సిద్ధం చేసుకుంటుండగా ఒక ప్రశ్న నా ముందు నిలిచింది.

ఈ నవలని ఏ పత్రికకి సీరియల్‌గా ఇవ్వాలని..

నా మొదటి నవల మోడల్ ప్రఖ్యాత సినీ నట, దర్శకులు దర్శకరత్న శ్రీ దాసరినారాయణరావుగారు ప్రారంభించిన ఉదయం దినపత్రికలో సీరియల్‌గా సెప్టెంబర్ 17, 1985 నాడు ప్రారంభమయింది. అదయ్యాక నా రెండవ నవల అశ్వభారతం కూడా 1986లో ఉదయంలోనే వచ్చింది.

ఆ తరువాత ఆంధ్రజ్యోతి దిన, వార పత్రికల్లో త్రినేత్రుడు, అనితర సాధ్యుడు, అక్షర

యిచ్చు సీరియల్స్‌గా వచ్చాయి.

సో... ఈ నవల మరో పత్రికలో వస్తే బావుంటుందని అనిపించింది. 1983లో ప్రారంభమయిన స్వాతి సపరివారపత్రిక వారపత్రికా రంగంలో అప్పటికే సంచలనాలు సృష్టిస్తోంది.

అప్పటికే నేను స్వాతి మాస, వారపత్రికల అభిమానిని... క్రమం తప్పకుండా కొని చదివేవాడిని... ఇప్పటికీ చదువుతున్నాను. నాకంతగా నచ్చిన పత్రిక స్వాతి.

ఉత్తరాల ద్వారానే స్వాతి బలరాం గారితో నాకు ఆత్మీయానుబంధం ఏర్పడింది. స్వాతి బలరాంగారంటే నాకు ఎనలేని గౌరవాభిమానాలు... అలాగే నేనంటే వారికి కూడా .

చాలా సార్లు స్వాతి బలరాంగారు హైదరాబాద్ వచ్చినప్పుడు కలిసేవాడిని. కాని ఎప్పుడూ నన్ను స్వాతికి రాయమని వారడగలేదు. అలాగే నేనూ రాసే ప్రయత్నం చేయలేదు.

పత్రిక ప్రారంభించిన అతి తక్కువ కాలంలోనే లక్షకాపీల సర్క్యులేషన్‌ని అధిగమించింది స్వాతి. వారపత్రికల చరిత్రలో ఇది ఓ రికార్డ్.

ఆ సందర్భంగా రవీంద్ర భారతిలో పెద్ద విజయోత్సవ సభ నిర్వహించారు. దానికి రావల్సిందిగా ఆత్మీయతతో కూడిన ఆహ్వానం అందింది. వెళ్ళాను. విజయోత్సవ సభ విజయవంతమైంది. బయటికొచ్చాక ఎప్పుడో దశాబ్దాల క్రితం ప్రారంభించిన ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి లాంటి అగ్రస్థాయి పత్రికల్ని అధిగమించి అగ్రస్థానంలో దూసుకుపోతున్నందుకు స్వాతిబలరాంగారిని, శ్రీమతి అమ్మాజీ బలరాంగారిని మనఃస్ఫూర్తిగా అభినందించాను. నా అభినందల్ని స్వాతి దంపతులు ఎంతో వినమ్రంగా ఆస్వాదించారు. అది వారి ఉన్నత సంస్కారానికి నిదర్శనం.

అదే రోజు సాయంత్రం న్యూ ఎమ్.ఎల్.ఎ క్వార్టర్స్ ప్రక్కన కొండ మీదున్న రిట్జ్ హోటల్‌లో ముఖ్యమైన అతిధులకి విందు ఏర్పాటు చేసారు.

ఆ విందుకి నేనూ హాజరయ్యాను. అప్పటికి కేవల ఓ సక్సెస్‌ఫుల్ నవలా రచయితనే.. కాని స్వాతి బలరాం గారు అప్పటికే ఎంతో ఉన్నతస్థాయి చేరుకున్న సంపాదకులు. అయినా నన్నో ఆత్మబంధువులా చూసుకున్నారు.

ఇక అప్పుడు ఉండబట్టలేక మన స్వాతికి నేనో సీరియల్ రాయాలనుకుంటున్నాను అని చెప్పగానే వారు అభినందనగా చూస్తూ ఉత్తేజపూర్వకమైన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

అప్పుడు చెప్పాను - నేను స్వాతికి రాయాలనుకుంటున్న నవల 'వీరప్పన్ మీద' అని.. వెంటనే నా భుజం తట్టి రెట్టింపు ఉత్సాహం అందించారు.

రక్తచందనం నవల నేపథ్య వివరాలు సేకరించుకుంటున్న దశలోనే, మూడు పత్రికలకి మూడు సీరియల్స్ రాస్తున్నాను.

ఈ లోపు మరో విచిత్రమైన సంఘటన జరిగింది.

మద్రాసు నుంచి నా స్నేహితురాలు జీవిత ఫోన్ చేసి 'మీరు వెంటనే మద్రాసు రావాలి సాయంత్రం ఫ్లైట్‌కి ట్రావెల్ అరేంజ్ చేస్తున్నాను' అన్నారు. దేనికని అడిగాను. 'రాజశేఖర్ గారికి మంచి కథకావాలి' అని ఆమె చెప్పటం జరిగింది.

అప్పటికే ఊపిరి సలపనివ్వని రచనా వ్యాసంగం... ఓ పక్క మూడు సీరియల్స్ రాస్తూ మరోపక్క రక్తచందనం నవలకి వివరాలు సేకరించుకుంటూ, ఇంకో పక్క సినిమాకి పనిచేయగలనా అని..

నా సందేహం ముందు, నాకు జీవిత తో ఉన్న స్నేహబంధం బలంగా నిలబడటంతో ఆ సాయంత్రమే మద్రాస్ బయలుదేరివెళ్ళాను.

వెళ్ళగానే నాకు కేటాయించిన హోటల్ రూములో దిగి, ఫ్రెష్ అయి సిటింగ్‌కి వెళ్ళటం అనే ఆనవాయితీ ఎగిరిపోయింది - మీనంబాకం ఎయిర్ పోర్ట్‌లో దిగగానే ఆమె పంపిన కారు నన్ను డైరెక్ట్‌గా టి.నగర్, బి.ఎన్.రెడ్డి రోడ్‌లో ఉన్న గుణశేఖర్ వరదరాజన్ (రాజశేఖర్ గారి పెద్ద తమ్ముడు) ఆఫీసుకి తీసుకువెళ్ళింది.

జీవిత, ఆమె అన్న మురళి కలిసి రాజశేఖర్ గారితో తీసిన 'మగాడు' సినిమా షూటింగ్‌లో ఒక రైల్వే ట్రాక్ బ్రిడ్జి మీద రాజశేఖర్ గారు పరిగెడుతూ పొరపాటున జారి 20 అడుగుల క్రిందకి పడిపోవటంతో ఆయన కాలి ఎముక దెబ్బ తిన్నది. దాంతో ఆపరేషన్ చేసి ఆయన కాలిలో రాడ్ పెట్టారు. దాంతో ఆయన విశ్రాంతిలో ఉన్నారు.

అప్పటికే వీరప్పన్ గురించి అటు కర్నాటకలోనే కాదు, ఇటు తమిళనాడులోనూ సర్వత్రా ఉత్కంఠ నెలకొని ఉంది.

వెళ్ళగానే 'ఇప్పుడేం నవల రాస్తున్నావ్ మోహన్?' అని అడిగారాయన. వీరప్పన్ మీద రాయబోతున్నానని చెప్పాను. వెంటనే ఆయన మొహంలో ఆనందం. వర్తమానంలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్న వీరప్పన్ బ్యాక్ గ్రౌండ్‌తో సినిమా చేస్తే అది ఒక సంచలనాత్మక సినిమా అవుతుందని, వెంటనే ఆ కథే చెప్పమన్నారు.

అప్పటికే మనసులో క్రమంగా అల్లుకుంటూ వస్తున్న వీరప్పన్ కథ చెప్పాను.

రాజశేఖర్ గారికి బాగా నచ్చింది. వెంటనే అడ్వాన్స్ ఇస్తూ కథ మీద కూర్చోమన్నారు.

అప్పటికి రాజశేఖర్ గారు చాలా పెద్ద హీరో అయ్యారు. హిట్ మీద హిట్ ఇస్తున్నారు.

నవలగా రాయకముందే అది ఒక పెద్ద హీరోకి నచ్చటం ఆనందం కలిగించే సంఘటనే. కాని ఎలా...? మూడు సీరియల్స్ రాస్తున్నాను. అవి మూడు, మూడు పత్రికల్లో సీరియల్స్‌గా వస్తున్నాయి.

ఒక్క రోజు నేను స్క్రిప్టు అందించటం లేటయినా నా మాట పోతుంది. సదరు పత్రిక ఇంటిగ్రిటి దెబ్బ తింటుంది.

నా ముఖంలోని సందేహాల్ని చదివినట్లు 'ఏదైనా సమస్యా?' అంది జీవిత..

ఉన్న విషయం చెప్పాను. జీవితకి ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం చాలా ఎక్కువ. ఎంత సమస్యనయినా తేలిగ్గానే డీల్ చేయగలదు.

'నో ప్రాబ్లమ్.. బ్లాక్ ఇంక్‌తో సీరియల్స్ రాస్తే - ఏది ఏ పత్రికకి పంపించాలో చెబితే, ఆ పత్రికకి ఫాక్స్ చేయిస్తాన'ని హామీ ఇచ్చింది జీవిత.

ఇక్కడ జీవిత నాకెలా స్నేహితురాలయింది చెప్పటం సబబుగా ఉంటుంది. 1986 లో నేను నా తొలి సినిమా 'చాదస్తపు మొగుడు' సినిమాకి కథ అందించాను. ఆ కథనే డియర్ అన్న పేరుతో నవలగా రాసాను.

ఆ సినిమాకి సత్యానంద్‌గారు మాటల రచయిత. నిర్మాత మిద్దే రామారావుగారు. ఆ సందర్భంలో సత్యానంద్‌గారికి నేను ఆత్మీయుడినయ్యాను.

ఆ తరువాత అనిల్ కుమార్ గారి దర్శకత్వంలో వచ్చిన 'శ్రీమతి కానుక' సినిమాకి నేను కథ అందిస్తే, తిరిగి సత్యానంద్‌గారు డైలాగ్స్ రాసారు.

ఆ అనుబంధంతో 1987లో సత్యానంద్ గారు నన్ను పర్సనల్‌గా తీసుకెళ్ళి మహాలింగపురంలో ప్రముఖ నిర్మాత చలసాని గారి ఆఫీసులో ఉంటున్న దర్శకేంద్రులు శ్రీకె.రాఘవేంద్రరావుగారికి పరిచయం చేసారు.

అప్పుడు రాఘవేంద్రరావుగారు, వెంకటేష్ బాబు హీరోగా బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ గారు నిర్మాతగా సినిమా ప్లాన్ చేస్తున్నాం. 'నీ దగ్గరేదన్నా హీరో వెంకటేష్ బాబుకి పనికొచ్చే కథ ఉందా? ' అని అడిగారు.

అప్పటికే నా 'త్రినేత్రుడు' నవల ఆంధ్రజ్యోతి వారపత్రికలో శ్రీ పురాణం సుబ్రహ్మణ్యంగారి సంపాదకత్వంలో సీరియల్‌గా వస్తోంది. దాన్ని దృష్టిలో పెట్టుకుని ఉందని చెప్పాను.

తెలుగు సినిమా చరిత్రనే మలుపుతిప్పిన దర్శకేంద్రులు శ్రీరాఘవేంద్రరావుగారు, దర్శక రత్న శ్రీ దాసరి నారాయణరావు గారు, కళాతపస్వి శ్రీ కె.విశ్వనాథ్ గారి దర్శకత్వంలో వచ్చే సినిమాలకి కథలందించాలని ఏ రచయితకు మాత్రం ఉండదు...!?

ఆ మరుసటి రోజే రాఘవేంద్రరావుగారికి 'త్రినేత్రుడు' కథ చెప్పాను. ఆయనకు నచ్చింది. అయితే చిన్న మెలిక పెట్టారు. ఇప్పటి వరకు వచ్చిన 'త్రినేత్రుడు' సీరియల్ ఆంధ్రజ్యోతి వీక్లీ కటింగ్స్ జీవితకి అందించమన్నారు.

జీవిత మంచి రీడర్.. అప్పటికే మంచి నటిగా చాలా పేరు తెచ్చుకుందామె. అంతవరకు ఆమెను సినిమాల్లో చూసానే గాని, ప్రత్యక్షంగా చూడలేదు, పరిచయం లేదు.

వెంటనే త్రినేత్రుడు కటింగ్స్ హైదరాబాద్ నుంచి తెప్పించి, టి.నగర్ ప్రకాశం స్ట్రీట్‌లో ఉంటున్న జీవిత ఇంటికి వెళ్ళి వాటినందించాను. అప్పుడే నాకు జీవితతో పరిచయం.

ఆ పరిచయం కొద్దికాలంలోనే మా మధ్య మంచి స్నేహంగా రూపుదిద్దుకుంది.

జీవిత త్రినేత్రుడు కటింగ్స్ చదివి కథ బావుందని రాఘవేంద్రరావుగారికి చెప్పటం జరిగింది.

ఆ టైములో రాఘవేంద్రరావుగారు నాగార్జున హీరోగా విజయశాంతి, జీవిత హీరోయిన్లుగా 'జానకి రాముడు' సినిమా డైరెక్ట్ చేస్తున్నారు.

సో... ఈ విధంగా జీవితతోటే కాక ఆమె కుటుంబ సభ్యులతో కూడా నాకు మంచి అనుబంధం ఏర్పడింది. ఆ స్నేహం ఇప్పటికీ కొనసాగుతోంది.

మరుసటి రోజు నుంచీ టి.నగర్ బోగ్ రోడ్‌లో ఉన్న ప్రముఖ నటదర్శకులు టి.రాజేందర్ గారి ఫ్లాట్‌లో సెటిలయి 'రక్తచందనం' కథ మీద వర్క్ చేయటం మొదలుపెట్టాను.

దీనికి దర్శకులు దాసరి నారాయణరావుగారు.

తెలుగు సినిమా పరిశ్రమ దెబ్బతినటానికి, లేదా కుంటుతూ నడవటనికి కారణం మంచి కథలు, మంచి టెక్నీషియన్స్, మంచి నటీనటులు, మంచి నిర్మాతలు లేక కాదు.

ఇగో.. ఇగోలు.. అహం అహాలు.. నేనే గొప్పన్న అర్థంలేని స్వాభిమానులు చిత్రపరిశ్రమని ఇప్పటికీ దెబ్బతీస్తూనే ఉన్నాయి. అయినా ఎవరూ పాఠాలు నేర్చుకోవటం లేదు నేర్చుకోరు.... నేర్చుకునే ఉద్దేశం కూడా ఎవరికీ ఉండదు. అప్పట్లో హీరో రాజశేఖర్ మంచి సక్సెస్‌తో ఉన్నారు. ఆయన డేట్స్... ఆయన తరపున కథలు వినటం.. ఓకే చేయటం అంతా జీవితే చూసుకుంటుండేది...

అప్పటికే రాజశేఖర్, జీవిత ప్రేమించుకుంటున్నారు...

'నేను చాలా పెద్ద డైరెక్టర్ని..... ఎన్నో హిట్స్ ఇచ్చాను ఇండస్ట్రీకి.... నేను జీవిత ఓకే చేసిన కథని డైరెక్ట్ చేయాలా? ' అని దాసరిగారు, 'నన్నే నమ్ముకున్న రాజశేకర్‌కి మంచి కథని సెలెక్ట్ చేయాల్సిన బాధ్యత నాదే కదా! ' అని జీవిత.. హీరో ఏ కథ ఫైనల్ చేస్తే ఆ కథతో సినిమా నిర్మించాలని నిర్మాతలు శివరాజు, వెంకటరాజుగార్లు..పీటముడి పడిపోయింది ఎవరు విజయపథాన ఉంటే వారి మాటే చెల్లుబాటవుతుంది సాధారణంగా. సీనియారిటీని విస్మరించకూడదు. అలాగే క్రియేటివిటీ విషయంలో సీనియారిటీని లెక్కిరించకూడదు..

మొత్తానికి ప్రాజెక్ట్ ఆగిపోతుందనే అనుమానం అందరికి వచ్చింది.. అందరిలో ఆదుర్దాతో కూడిన భయం చోటు చేసుకుంది. అహాల స్థాయి కొంత తగ్గింది...

పీటముడి ఒకింత సడలింది. మొత్తానికి టి.నగర్‌లోని వెంకటరాజుగారింట్లో సినిమా ముహూర్తం పూజ జరిగింది. కొంత విరామం దొరకటంతో నేను జీవితకి 'మరలా మద్రాసు వస్తాన'ని చెప్పి హైదరాబాద్ వచ్చేసాను.

మిగతా వ్యాపారాల్లో వ్యాపారస్తులు నష్టాల్లోంచి లాభాల్లోకి ప్రయాణం చేస్తారు అదీ కుదరకపోతే లాభనష్టాలు లేని బ్రేక్ ఈవెన్‌లోకి ప్రయాణం చేస్తారు. అదీ కుదరకపోతే వ్యాపారాన్నే నిలిపేస్తారు.

కానీ ఒక్క సినిమా పరిశ్రమలోనే నష్టాల్లోంచి నష్టాల్లోకి, సమస్యల్లోంచి సమస్యల్లోకి ప్రయాణంచేస్తారు.

సమస్యల్లోంచి సమస్యల్లోకి ప్రయాణంచేసే వాళ్ళు దురదృష్టవంతులు. సమస్యల్లోంచి పరిష్కారంలోకి ప్రయాణం చేసేవాళ్ళు అదృష్టవంతులు. సమస్యల్లోంచి, పరిష్కారాల్లోంచి ప్రశాంతతలోకి ప్రయాణం చేసేవాళ్ళు ప్రాజ్ఞులు.

ప్రాజ్ఞత ఎక్కడుందీ రోజుల్లో ..!? ఏరంగంలోనూ లేకుండాపోయింది.!

మొత్తానికి హైదరాబాద్ వచ్చి వీరప్పన్ మీద నవలా రచనకు శ్రీకారం చుట్టాను. అప్పటికింకా నవలకి ఏ పేరూ పెట్టలేదు.

సినిమా ముందుకెళుతుందా? తీస్తారా..? తీయరా..? తిరిగి అహాలు నిద్రలేస్తే ఏమో!? ఏం జరగనుందో!? ఎవరికీ తెలీని అయోమయస్థితి... అనుక్షణం అనిశ్చితిలో కొట్టుమిట్టాడేదే సినిమా పరిశ్రమ.... ఇంత అనిశ్చితి ఏరంగంలోనూ ఉండదు.

మౌలికంగా నేను నవలా రచయితని... కాబట్టే వీరప్పన్ మీద సినిమా తీస్తారా లేదా అన్న మీమాంస నాలో ఏమాత్రం లేదు. కాని ఎంతో కొంత నా సమయాన్ని ఈ ఆలోచనలు నమిలేసేవి. అందులో ఉద్రిక్తత ఏం లేదు, ఆసక్తి మాత్రమే ఉండేది...

ఏరచయితకైనా వాళ్ళు రాసుకున్న కథని వెండితెరమీద చూసుకోవాలన్న ఉత్తేజభరితమైన ఉద్వేగం ఉంటుంది..

తిరిగి మద్రాసులో శ్రీ దాసరిగారు, జీవితా రాజశేఖర్ మధ్య ఇగో ప్రాణం పోసుకుంది. అది రోజు రోజుకి వారి మధ్య దూరాన్ని పెంచుకుంటూ పోయింది.

ఈ విషయం నాకు కాస్త ఆలస్యంగానైనా మద్రాసులో ఉన్న నా మిత్రులద్వారా తెలిసింది... బాధపడ్డాను...

ఒక్కడుగు అహాన్ని తగ్గించుకుంటూ వెనక్కి వేస్తే, బోలెడు సమస్యలకి పరిష్కారం లభిస్తుంది.. ఎన్నో అడుగులు ముందుకేయవచ్చని తెలిసినా ఎవరూ ఆపని చేయరు.

వీటి మూలంగానే వదులయ్యే ముడులు కూడా ఎప్పటికీ విప్పలేని క్లిష్టస్థితికి చేరుకుంటాయి. ఇలా ఎన్నో నా సినిమా కథలు మధ్యలోనే కొండెక్కేసాయి. వీటి విషయం ముందు ముందు వివరిస్తాను.

ఇవన్నీ ఇలా ఉండగా మరో కొత్త సవాల్ వచ్చి నా ముందు నిలిచింది.

ఈ సవాల్ కూడా వీరప్పన్ నవలకు సంబంధించిందే.

నా విజయాలపట్ల, నా అభివృద్ధి పట్ల అసూయను పెంచుకున్న ఓ సంపాదకుడు బచ్చల కూర భద్రం (పేరు మార్చటం జరిగింది) నన్ను నిలువరించాలని పెద్ద ఎత్తువేసి మరో రచయిత శైలకుమార్‌ని రంగలోకి దింపాడు.

(బచ్చల కూర భద్రం నా అభివృద్దిని ఎందుకు నిలువరించాలనుకున్నాడో ఈ వివరాలు తరువాత వెల్లడిస్తాను)

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న అడవిదొంగ వీరప్పన్ మీద నవల రాస్తే ఆంధ్రజ్యోతి వీక్లీలో సీరియల్‌గా వేస్తానని శైలకుమార్‌ని ప్రలోభపెట్టాడాయన.

ఆంధ్రజ్యోతి వీక్లీలో సీరియల్ రావటం ఓ రచయితకి మంచి ఎదుగుదలే...

శైలకుమార్‌లో రాయాలనే ఉద్వేగం, ఉత్సాహం చోటు చేసుకున్నాయి.

అయితే వీరప్పన్ గురించి ఏమీ తెలియకుండా నేనెలా రాయగలనని శైలకుమార్ తన నిజాయితీని రుజువు చేసుకున్నాడు.

'ఆంధ్రజ్యోతి దినపత్రికలో మిగతా పత్రికల్లో వీరప్పన్ గురించి చాలా వార్తలు వచ్చాయి. ఇంకా వస్తున్నాయి. అవన్నీ నీకందిస్తాను' - వాటి ఆధారంతో రాయమని బచ్చల కూర భద్రం, శైలకుమార్‌ని ఎంకరేజ్ చేసాడు.

ఇలా జరగటానికి కూడా ఓ కారణం ఉంది. ఒక తప్పుకూడా ఉంది. ఆ తప్పు నేను చేసిందే నేను వీరప్పన్ మీద నవల రాయబోతున్నానని నాకు తెలిసిన ఓ చిత్రకారుడికి, ఓ ఔత్సాహిక ఫోటోగ్రాఫర్‌కి చెప్పాను. ఈ వార్త మరికొందరికి చేరిపోయింది.

అది అలా.. అలా.. మరెంతమందికి చేరిపోయిందో తెలియదు. అప్పట్లో నేను రాయబోయే నవల ఏ సబ్జెక్ట్ నేపథ్యంలో అనే దానిమీద నా తరువాత నవలా రచయితలయిన వారితోనే కాదు, నాకంటే ముందే రచయితలయిన వారిలో కూడా ఒక ఆసక్తి చోటు చేసుకుని ఉండేది.

అదేదో ముందే తెలిస్తే ఆ నేపథ్యంలో నేనూ రాస్తే పెద్ద రచయితనయిపోతానని, రేస్‌లో సూర్యదేవరని దాటేస్తానని చాలామంది ప్రయత్నించారని నాకు తెలుసు. ఇలా ప్రయత్నించిన వారిలో ప్రధముడు కిరణ్ కుమార్ అనే రచయిత.

అయినా నేను ఎప్పుడూ భయపడలేదు. వాళ్ళగురించి ఆలోచించలేదు. యద్దనపూడి సులోచనారాణి గారు తెలుగు సోషల్ నవలని బాగా పాపులర్ చేయటమే కాక, వాటి ద్వారా లక్షలు సంపాదించవచ్చని రుజువు చేసారు.

ఆ తరువాత మల్లాది గారు, యండమూరి గారు తెలుగు నవలా స్థాయిని అత్యున్నత శిఖరాలకు చేర్చారు.

నేను నా మొదటి నవల రాయటానికి ముందే ఎందరో బాగా పాపులర్ అయిన నవలా రచయితలున్నారు... వాళ్ళ ధాటికి కొత్తవాళ్ళెవరూ తట్టుకోలేని పోటీ ప్రపంచం నెలకొనుంది అప్పట్లో (1985) ఉన్న పత్రికలు తక్కువ.. రాసే రచయితలు ఎక్కువ... ఒక్క నవల రాసినా అధి పాఠకులకి నచ్చితే రాత్రికి రాత్రే పెద్ద రచయితల లిస్టులోకి చేర్చేరోజులవి. తెలుగు పాఠక ప్రపంచాన్ని నవలా రచయితలు శాసించారంటే అతిఅయోక్తి కాదు.. ఆరోజుల్లో

అసలు చాలామంది స్వభావ సిద్ధమైన రచయితలు కారు. తపన, జిజ్ఞాస ఉన్నవాళ్ళు కాదు. అందుకే చాలామంది రచయితలు కొన్ని నవలలు రాసి, ఆ తరువత తెరమరుగైపోయారు.

చేపల చెరువుల మీద లాభాలొస్తున్నాయంటే అందరూ పొలాల్లో చెరువులు తవ్వి చేపలు పెంచే బాపతు మనకెక్కువ.. అంతే తప్ప అది తనకు నచ్చిన వ్యాపకమా? వ్యాపారమా? చివరి వరకు దానిలోనే కొనసాగగలను అనే ఆలోచనలేదు.

మల్లాదికి, యండమూరికి, సూర్యదేవరకి బోలెడు డబ్బులొస్తున్నాయి... లక్షల్లో అభిమానులు... పేపర్లో ఫోటోలు ఇంటర్వ్యూలు.. సన్మానాలు... సత్కారాలు.. వారి నవలలు కన్నడ దినవార మాసపత్రికల్లో సీరియల్స్‌గా వస్తూ కన్నడనాట కూడా లక్షలమంది అభిమానులు తయారై పోతున్నారు... వాళ్ళు కార్లు కొనుక్కున్నారు... కాసులొస్తున్నాయి.... మరీ ముఖ్యంగా పాఠకురాళ్ళు ఆ ముగ్గుర్ని బాగా అభిమానిస్తున్నారు.

అదే ప్రాతిపదికగా చాలా మంది రచయితలుగా అవతారం ఎత్తారు.. అంతే తప్ప జిజ్ఞాస, తపనతో కాదు.. వాళ్ళెవరూ ఇప్పుడు లేరు.. రియల్ ఎస్టేట్ వ్యారంలోకి, రాజకీయాల్లోకి, రాజకీయనాయకులకు వందిమాగధులుగా మారిపోయారు.

వీళ్ళు గాలివాటు వాళ్ళు. ఎక్కడ బెల్లం దొరుకుతుందంటే అక్కడికి చేరిపోయే రకం. వీళ్ళకు తెలియదు.. ఎక్కడ విషం దొరుకుతుందో అక్కడికి వెళ్ళే వాళ్ళే కార్యశీలురు. రిస్క్ బేరర్స్... రిస్క్ చాటునే అదృష్ట దేవత తొంగి చూస్తుంటుంది. ఆ విషయమే మందుగా మారి కోట్లమందిని బతికించగలదు.. అబ్బే చేదా... మనకెందుకు? అబ్బా..!! తీపా.. మనకే కావాలి.. మనకి మాత్రమే కావాలి... మనకు కూడా కావాలి కాదు... మనకు మాత్రమే కావాలి...

అలాంటి రచయితల కోవలోకి ప్రథమంగా వచ్చేది వేంపల్లి నిరంజన్ రెడ్డి...

ఇతను ఒకప్పుడు నాకు, మల్లాదిగారికి అభిమాని..

కొన్ని రాశాడు...

కొన్ని వచ్చాయి...

ఆ తరువాత ఏడి...?

నవలకు టీవీ వచ్చాక ఆదరణ తగ్గింది..ఇప్పుడేంటి... రియల్ ఎస్టేట్... ఇలాంటివాళ్ళ మూలంగానే నవల జీవితకాలం కుచించుకుపోయింది.. ఏ ఎండకా గొడుగు అనేది వేల సంవత్సరాలనాటి సామెత.. ఇదిప్పుడు పాతబడిపోయింది.

ఎండలో వందల రకాలేం లేవు. ఎండ ఒకటే ఎక్కడయినా. ఏ దేశంలో ఏప్రాంతంలో అయినా ఏ అవసరానికి ఆ గొడుగు అన్నవి వీళ్ళకు సరిపోతుంది.

మల్లాదిగారు, యండమూరిగారు రచనా వ్యాసంగం ప్రారంభించినప్పుడు ఏదో ఆశించి ప్రారంభించలేదు.. రాయాలనే జిజ్ఞాస... తపన.. రాస్తే ఏమొస్తుందని వీళ్ళు ఆలోచించలేదు. ప్రారంభంలోనే ఇలా ఆలోచించి ఉంటే ఈ స్థాయికి వచ్చేవాళ్ళు కాదు.

1985లో నేను నా మొదటి నవల రాసేముందు ఏం ఆలోచించలేదు. ఉదయంలో సీరియల్ రాస్తే ఏమొస్తుంది.. కొద్దిగా డబ్బిస్తారు..

ఆ తరువాత నవలగా ముద్రించే పబ్లిషర్ కొంతిస్తారు.. దాంతో నా అప్పులు తీరిపోతాయి.. ఇంతే.. ఇంతవరకే ఆలోచించాను.

మోడల్ నవలకి ఉదయం యాజమాన్యం పదిహేనువందలు ఇచ్చింది. దీన్ని నవలగా వేసిన నవజ్యోతి పబ్లికేషన్స్ 3,000 ఇచ్చారు.

పాపులారిటీ, ధనరాసులు.. లక్షలాది పాఠకుల్ని, పాఠకురాళ్ళని సొంతం చేసుకుందామని రాయలేదు. రాయకుండా ఉండలేక రాసాను.

ఇదలా ఉంచితే... బచ్చులకూర భద్రం, శైలకుమార్‌తో వీరప్పన్ మీద నవల రాయించే కార్యక్రమంతో మునిగిపోయాడు.

ఓ పత్రికా సంపాదకుడికి ఇదేం పని..? అని అతన్ని చాలామంది ప్రశ్నించారట.. ఐ కెన్ క్రియేట్ రైటర్స్ అని చెప్పాడట.

ఒకరు చేస్తే మరొకరు రైటర్ అయిపోతారా? నవ్వుకున్నాను ఇది తెలిసి.

(కొనసాగింపు వచ్చేనెలలో)

**suryadevaranovelist@gmail.com**